ప్రైవేట్ నర్సరీలతో జర జాగ్రత్త

ఏ మాత్రం పొరపాటు జరిగినా రైతుకు తీవ్ర నష్టం

- నారు నాణ్యతలో రాజీ పడకూడదు
- ప్రైవేట్ నర్సరీల నిర్వాహకులు నిబంధనలను పాటించకుంటే చర్యలు

కలిగిరి: మిర్చి, టమాటా, వంగ, క్యాబేజీ, బంతి తదితర పంటలు సాగు చేసే రైతులు నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు నారు కోసం ప్రైవేట్ నర్సరీలపై ఆధారపడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రైవేట్ నర్సరీల నిర్వాహకులు నాసిరకం నారును రైతులకు అంటగడుతున్నారు. నర్సరీల నిర్వాహకుల మాటలు నమ్మి రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన రైతులు దిగుబడులు సక్రమంగా రాక, తెగుళ్ల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా నారు కొనుగోలు సమయంలో మోసపోతే రైతుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. పైరు ఏపుగా పెరిగి ఎన్ని మందులు వాడినా దిగుబడులు రాక రైతులు నష్టపోతుంటారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ నర్సరీల నిర్వాకంతో రైతులు నష్టపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే రైతులు మోసపోకుండా ఉండేందుకు విత్తన చట్టం ప్రకారం నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్వాహకులు విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేస్తున్నారు.. ఎలా పెంచుతున్నారు.. రైతులకు ఎలా ఇస్తున్నారని ఉద్యాన శాఖాధికారులు పర్యవేక్షణ జరుపుతున్నారు. వింజమూరు, కలిగిరి మండలాల్లో పదుల సంఖ్యలో అనుమతులు లేకుండా ప్రైవేట్ నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు ఆ నర్సరీలను పరిశీలించి వెంటనే అనుమతులు పొందాలని నిర్వాహకులకు ఇటీవల నోటీసులు జారీ చేశారు.


వింజమూరులో నిబంధనలు పాటించని ప్రైవేటు నర్సరీ నిర్వాహకులకు నోటీసు ఇస్తున్న ఉద్యాన శాఖాధికారులు (ఫైల్)

నర్సరీలు పాటించాల్సిన నిబంధనలు

- నారు పెంచే నర్సరీ చుట్టూ ఇన్‌సెక్ట్ నెట్ ఉండాలి.
- ఇన్‌సెక్ట్ నెట్‌కు ఎలాంటి చిల్లులు లేకుండా చూడాలి.
- డబుల్ డోర్‌కు ఎలాంటి సందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- షేడ్‌నెట్‌కు 3 అడుగుల విస్తీర్ణం వరకు ఎలాంటి కలుపు, చెట్లు ఉండకూడదు.
- నర్సరీ లోపల పసుపు రంగు జిగురు అట్టలు ఉంచాలి.
- నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూరా ట్రాప్ క్రాఫ్ (బంతి మొక్కలు) వేయాలి.
- ప్రతి బెడ్డుకు ముందు ఆ బెడ్డులో పోసిన నారును సూచిస్తూ కంపెనీ, వెరైటీ, నాటిన తేదీ మొదలగు వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలి.
- నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన కంపెనీల బిల్లులు తీసుకోవాలి.
- నర్సరీకి సంబంధించిన ఏడు రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయాలి.
- నర్సరీ లైసెన్స్ నంబర్ ప్రింట్ చేసిన బిల్లులు మాత్రమే నారు కొనుగోలుదారులకు ఇవ్వాలి.
- నర్సరీ పేరును సూచిస్తూ నర్సరీ బయట పెద్ద బోర్డును ఏర్పాటు చేయాలి.


ప్రైవేట్ నర్సరీలో పెంచుతున్న నారు

నిబంధనలు పాటించకుంటే చర్యలు



అనుమతులు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ప్రైవేట్ నర్సరీలపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నర్సరీల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. రైతులు నర్సరీలో నారు కొనుగోలు చేసే సమయంలో కంపెనీ రకం, లాట్ నంబర్ తదితర పూర్తి వివరాలతో కూడిన రసీదు తీసుకోవాలి. అనుమతులు ఉన్న నర్సరీల నుంచి మాత్రమే రైతులు నారు కొనుగోలు చేయాలి. వీలైనంత వరకు రైతులే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి నారు పెంచుకోవాలి.

– షేక్ షహీల్, ఉద్యాన శాఖాధికారి, వింజమూరు

ఇసుక రీచ్ వద్ద స్వల్ప వివాదం


అధికారులను చుట్టుముట్టిన లారీ డ్రైవర్లు

మర్రిపాడు: మండలంలోని మర్రిపాడు సమీపంలో ఉన్న ఇసుక డంపింగ్ యార్డు వద్ద శనివారం స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఇసుక లోడింగ్ కోసం వచ్చిన లారీల డ్రైవర్లు తమ వాహనాలకు ముందుగా లోడింగ్ చేయాలంటూ అధికారులపై దుర్భాషలాడారు. ఒక్కసారిగా డ్రైవర్లు చుట్టూ ముట్టడంతో అధికారులు రసీదులను నిలిపివేశారు. జిల్లాలో ఇసుక మరే ప్రాంతంలో అందుబాటులో లేకపోవడం, మర్రిపాడు నుంచే అత్యధికంగా ఇసుక రవాణా జరుగుతుండడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అధికారులు పేర్కొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: వరికుంటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


క్రాకుటూరులో చిన్నారికి ఆధార్ ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాయుడు

కలిగిరి: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు సూచించారు. మండలంలోని కుమ్మరకొండూరులో ఉపాధి హామీ పథకం కూలీలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరుకావాలని సూచించారు. అనంతరం క్రాకుటూరులోని గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇసుక డంపింగ్‌కు స్థల పరిశీలన



సంగం: సంగం కొండ సమీపంలో ఇసుక డంపింగ్ యార్డు కోసం ఆర్డీఓ మధులత శనివారం స్థల పరిశీలన చేశారు. నూతన ఇసుక పాలసీ అమలులోకి వస్తున్న నేపథ్యంలో రీచ్ నుంచి ఇసుకను డంపింగ్ చేసేందుకు కావాల్సిన స్థలం కోసం ఆర్డీఓ పలు ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉందో త్వరగా చూసి నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.విక్రమ్‌సిన్హా

కావలి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.విక్రమ్‌సిన్హా అన్నారు. శనివారం కావలిలో జరిగిన లోక్ అదాలత్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఖైదీలకు కొన్ని చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యుడు ఐ.సాయిప్రసాద్, న్యాయవాది జె.శ్రీదేవి, లోక్‌అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి, సూపరింటెండెంట్ చినసుబ్బయ్య, జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


సోమశిల: మొక్క నాటుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

సోమశిల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓ అలసత్వంపై ఆందోళన

ఉదయగిరి: ఉపాధ్యాయులకు సంబంధించి ఇన్‌కమ్ ట్యాక్స్ చెందిన టీడీఎస్ ఇంతవరకు పూర్తి చేయకుండా అలసత్వం చేయడంపై టీడీఓ అయిన ఎంఈఓ తీరుపై యూటీఎఫ్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయగిరిలో యూటీఎఫ్ నేతలు విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రక్రియ తర్వాత టీచర్లు వ్యక్తిగతంగా ఈ–ఫైలింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. మే నెల నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా ఇంతవరకు చేయలేదని, ఈ నెల 31వ తేదీ లోపు ఫైలింగ్ చేయకపోతే రూ.5 వేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ప్రక్రియ పూర్తి చేయించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుముకు డీడీఓ బాధ్యత వహించాలని అన్నారు.

ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యం

ఆత్మకూరు: ఉన్నత ప్రమాణాలే లక్ష్యంగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నామని, ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులందరూ మంచి ఉద్యోగాలు పొందే స్థాయికి తీసుకెళ్లడమే తమ ధ్యేయమని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.కిషోర్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల యాజమాన్యం, హెచ్‌ఓడీలు విద్యార్థులు ఉన్నత స్థితికి చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్ఫోసిస్ ప్రోగ్రామ్ మేనేజర్ కుషాల్ దేవా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని చదవాలన్నారు. కార్యక్రమంలో కోడెనా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కోఫౌండర్ ఎస్ జ్ఞాంధర్, గీతాంజలి కళాశాల ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ యు.పెంచలరెడ్డి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న అతిథులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సంగం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సంగం మండలం అన్నారెడ్డిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. నెల్లూరులో శుక్రవారం జిల్లాస్థాయి జూనియర్ బాలికల విభాగంలో సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో భానుప్రకాష్,సుధీర్, బాలికల విభాగంలో హేమలత, నందిని వాణి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఆగస్టు 16, 17, 18 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్‌ఎం లక్ష్మీదేవి, పీఈటీ మహేష్ తెలిపారు.


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీఈటీ

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ఆత్మకూరురూరల్: మండలంలో గ్రామ పంచాయతీల వారీగా చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆత్మకూరులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిసైడింగ్ అధికారిగా డ్వామా అడిషనల్ పీడీ విజయలక్ష్మి వ్యవహరించారు. ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు గ్రామాల వారీగా జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల సందర్భంగా గుర్తించిన అవకతవకలకు సంబంధించి సంబంధిత పంచాయతీలకు జరిమానాలు విధించారు. కూలీల వేతనాలకు సంబంధించి రూ.1,01,801, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.1,46,102 రికవరీ చేయాలని ప్రిసైడింగ్ అధికారి ఆదేశించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు సంబంధించి ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై సభలో పాల్గొన్నవారు పలు సందర్భాల్లో వాదనలకు దిగారు. మొత్తం మీద మండలంలో రూ.8,89,53,708 ఖర్చు చేసినట్లు అధికారులు సభావేదికలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డ్వామా పీడీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ శంకర్ నారాయణ, ఏపీఓ శిరీష, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎస్‌ఆర్‌పీ నాగార్జున, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

కావలి: కావలి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పాతూరులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం 80 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్ అందరూ రక్తదాతలుగా మారాలని సూచించారు. ఎన్‌సీసీ అధికారి మస్తాన్‌వలి మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి ధన్యవాదాలు తెలిపారు.


కార్యక్రమంలో టెక్నీషియన్ పద్మావతి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



దుత్తలూరు: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెడ్డుపాడు సర్పంచ్ బి.వెంకటరత్నం సూచించారు. శనివారం మండలంలోని తెడ్డుపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు సర్పంచ్ స్వీట్లు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వెంగయ్య, హెచ్‌ఎం బీబీజాన్, ఉపాధ్యాయురాలు ఎం.శ్రీలత, స్థానికులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

వింజమూరు(ఉదయగిరి): నెల్లూరు టౌన్ హాల్‌లో ఆగస్టు 10వ తేదీన జరిగే ఏపీటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి తెలిపారు. వింజమూరులోని ఆ సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం వింజమూరు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి మండలాల ప్రధాన బాధ్యతులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు వి.శివకోటారెడ్డి, జిల్లా కార్యదర్శి జి.నారాయణ, సంస్థ ప్రతినిధులు మల్లికార్జునరావు, చినబాబు, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, మదర్, రమణయ్య, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని యూనియన్ రోడ్డులో షాషావలిసాహెబ్ గంధ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చి చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



సోమశిల: తహసీల్దార్ నరసింహారావు బదిలీ అయిన నేపథ్యంలో శనివారం అనంతసాగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ గిరీష్, ఆర్ఐ రమేష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వెంగమాంబపురంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు



వరికుంటపాడు: మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో శనివారం మండల వైద్యాధికారిణి ఆయేషా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె 34 మంది వ్యాధిగ్రస్తులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కువగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, జ్వర లక్షణాలు ఉంటే వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపులు

కావలి: విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్న వారు ఆదివారం కూడా చెల్లించవచ్చని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వసంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు ఉన్న పటికీ వెంగళరావునగర్‌లో రెగ్యులర్ రెవెన్యూ కలెక్షన్ ఆఫీసు(కరెంట్ ఆఫీస్)లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

జంప్ రోప్ రాష్ట్రస్థాయి పోటీలకు కావలి విద్యార్థుల ఎంపిక



కావలి: మండలంలోని కొత్త సత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కావలిలో జరిగిన సబ్ జూనియర్ జంప్ రోప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఆ పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థినులు ఎల్లంగారి జ్యోతి, పొమంజి సరిత, ఎల్లంగారి కల్పన, వాయిల శాలిని నంద్యాలలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీంద్రప్రసాద్, పీడీ మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పెంచలస్వామి ఆరాధన

ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరులో శ్రీహనుమాన్ భక్త పెంచలస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో నాయుడు భాస్కర్‌నాయుడు, నాయుడు పెంచలనాయుడు, వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెంచలస్వామి సమాధి వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డిప్యూటీ ఈఓ కె.గోపాల్ సూచించారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటి దానిని సంరక్షించి భావితరాలకు మేలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొత్తం పాఠశాల ఆవరణలో 70 మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న డిప్యూటీ ఈఓ, ఉపాధ్యాయులు

అబ్దుల్ కలాంకు ఘన నివాళి


కావలి: కలాం చిత్రాపటం వద్ద నివాళులర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నేతలు


కావలి: చిన్నారులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేస్తూ..

కావలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కావలి శాఖ ఆధ్వర్యంలో కావలిలో శనివారం భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని అబ్దుల్ కలాం చిత్రపటానికి ఆ సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సహాధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి సాయిరాంసింగ్, ఉపాధ్యక్షులు వరప్రసాద్, వైవీ నాగేశ్వరరావు, కృష్ణారావు, జమున తదితరులు పాల్గొన్నారు. అలాగే ముసునూరు చంద్రబాబునాయుడు గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి చిన్నారులకు పలకలు, పుస్తకాలు, పెన్సిళ్లు, గర్భిణులు, బాలింతలకు ఐరన్ సిరప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ కార్యకర్త సుశీల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కలాం విగ్రహానికి కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీవీరావు, సెక్రెటరీ దామిశెట్టి బాలసురేష్‌బాబు, పరిపాలన అధికారి జి.రమేష్‌బాబు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా కావలి పట్టణం జెండాచెట్టు సెంటర్ వద్ద ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


సోమశిల: కలాం చిత్రపటం నివాళులర్పిస్తున్న దృశ్యం

చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

సోమశిల: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా శనివారం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల నలుగురు మృతిచెందడంతో సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. 2వ వార్డులో షేక్ బీబీ, 12వ వార్డులో ఆత్మకూరు వెంకటమ్మ, 23వ వార్డులో కొమరగిరి తిరుపతయ్య, బీబీజాన్ మృతిచెందడంతో శనివారం ఆయా కుటుంబాలను పరామర్శించి తమ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి